

సీఎస్ఏ క్రీడోత్సవాల్లో మాట్లాడుతున్న మురళీనాయక్

విద్యతో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్యం

- జాతీయస్థాయిలో ఆటగాళ్లు రాణించాలి
- మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

8

జిల్లా కొత్త ఎస్పీగా శబరీష్



మహబూబాబాద్ క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా నూతన ఎస్పీగా శబరీష్‌ను నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పని చేస్తున్న ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్‌ను ములుగు జిల్లాకు బదిలీ చేశారు. మహబూబాబాద్ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణతో పాటు, నిషేధిత నల్లబెల్లం, గుడుంబా అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపిన సుధీర్‌రాంనాథ్ కేకన్ తనదైన ముద్ర వేసుకున్నారు. కాగా, శబరీష్ బాధ్యతలను స్వీకరించనున్నారు.

ఆటో ప్రయాణికుల భద్రత కోసం 'అభయ యాప్'

- ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్


8

■ సీన్ రివర్స్

అంచనాల పెంపులో అక్రమాల కంపు

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిపై ఫోరెనిక్స్ ఆడిట్‌లో తేలిన నిజాలు

- సుమారు రూ.600 కోట్ల వరకు అక్రమాలు జరిగినట్లుగా నిర్ధారణ?
- రూ.1116 కోట్ల నుంచి రూ.1725.95 కోట్లకు పెంచిన గత బీఆర్‌ఎస్ సర్కారు
- అంచనా వ్యయాన్ని రూ.167.95 కోట్ల మేర తగ్గించిన కాంగ్రెస్ సర్కారు
- జైలు స్థలం తాకట్టు పెట్టి తెచ్చిన రుణంపై విజిలెన్స్ విచారణ
- ఫోరెనిక్స్ ఆడిట్ నివేదిక వచ్చినా, ఇంకా అందని విజిలెన్స్ నివేదిక
- మార్చి నాటికి సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి పూర్తి చేసేలా ప్రభుత్వం కసరత్తు
- అంచనాల పెంపులో అక్రమాలపై ముదురుతున్న రాజకీయం



■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

వరంగల్ నడిబొడ్డున ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అంచనా వ్యయం భారీగా పెంపు వాస్తవమేనని ఫోరెన్సిక్ ఆడిట్ బృందం నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఎలాంటి అనుమతులు లేకుండా గత ప్రభుత్వం మౌఖిక ఆదేశాలతో ఆస్పత్రి అంచనా వ్యయాన్ని పెంచిందని తేల్చినట్లుగా సమాచారం. పనులు మొదలు పెట్టి.. ఏడాది గడవక ముందే వ్యయాన్ని రూ.625 కోట్లకు పైగా పెంచడంపై సీఎం రేవంత్‌రెడ్డి ఫోరెనిక్స్ ఆడిట్‌కు ఆదేశించారు. అయితే ఇదే సమయంలో ఆస్పత్రి ఆకృతి, జైలు భూముల తాకట్టుపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణ కూడా జరుపుతోంది. ప్రస్తుతం ఫోరెనిక్స్ నివేదిక వచ్చినప్పటికీ విజిలెన్స్ నివేదిక రాకపోవటంతో ప్రభుత్వం చర్యలు వెనుకాడుతోంది. మరోవైపు మార్చిలోపు సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోంది.

అంచనాల్లో అక్రమాలేనా..?

గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2021 జూన్ 22న 2వేల పడకలతో నిర్మించనున్న

(మిగతా 7లో..)

ప్రదర్శనను జయప్రదం చేయండి : టీపీటీఎఫ్

గూడూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 24న కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే నిరసన ప్రదర్శనను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు బలాష్టి రమేష్ పిలుపునిచ్చారు. గూడూరు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు ఈక ఆదినారాయణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండాలను గ్రామపంచాయతీలుగా మార్చి గిరిజనుల ముంగిట్లోకి పాలన తెచ్చామని గొప్పలు చెప్పిన పాలకులు గిరిజన పిల్లలందరికీ న్యాయమైన, సమానమైన విద్యనందించడంలో వైఫల్యం చెందారని ఆరోపించారు. జిల్లా బాధ్యులు దుర్గయ్య, శ్రీనివాస్, నర్సింగరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి'



సీపీఎం రాజకీయ శిక్షణ తరగతుల్లో ప్రసంగిస్తున్న జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

మహబూబాబాద్ టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.నాగయ్య, జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లో సీపీఎం పట్టణ రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన వారు మాట్లాడుతూ భారత్‌లోని 28 రాష్ట్రాల్లో సీపీఎం అధికారంలో ఉన్న కేరళ రాష్ట్రంలో విద్య, వైద్యం, ఉపాధి, సమానత్వం, పేదలులేని రాష్ట్రంగా దేశానికి రోల్‌మోడల్‌గా నిలిచిందని వివరించారు. జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు సూర్నపు సోమయ్య, పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాంనాయక్, సమ్మెట రాజమౌళి, రావుల రాజు, కుమ్మరికుంట్ల నాగన్న, వెంకన్న పాల్గొన్నారు.

తెల్లబోతున్నారు..!

పత్తి అమ్ముకోవడానికి రైతుల అవస్థలు

- కపాస్ కిసాన్ యాప్‌తో ఇబ్బందులు
- స్మార్ట్ ఫోన్‌తో హలధారి కుస్తీలు
- అవగాహన కల్పించడంలో వైఫల్యం
- పంటను దళారులకు విక్రయిస్తున్న కర్షకులు





అమ్మాపురంలో దళారులకు పత్తి విక్రయిస్తున్న రైతులు

తొర్రూరు రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పత్తి రైతులు పరేషాన్ అవుతున్నారు. కపాస్ కిసాన్ యాప్‌తో కష్టాలు పడుతున్నారు. ఏటా పత్తి సీజన్ ప్రారంభమైందంటే.. హలధారులు ఆనందంగా ఉండేవారు. కానీ, కొత్త నిబంధనలతో పత్తి పండించిన కర్షకులు పడరాని పాట్లు పడుతున్నారు. అతివృష్టి అనావృష్టిలను ఓర్చి పెట్టుబడిపెట్టి పంటలు పండించిన వారికి అమ్ముకునే స్వేచ్ఛ లేకుండాపోయింది. పత్తిని విక్రయించుకోవడానికి కపాస్ కిసాన్ యాప్ తప్పని సరి కావడంతో గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రిజిస్ట్రేషన్ కోసం కుస్తీ..

రైతులు యాప్‌ను సెల్ ఫోన్లో డౌన్‌లోడ్ చేసుకొని ఇన్‌స్టాలేషన్ చేసుకోవాలని సంబంధిత అధికారులు సూచిస్తున్నప్పటికీ, దాన్ని వినియోగించడం ఎలానో అవగాహన కల్పించడంలో విఫలమయ్యారు. కపాస్ కిసాన్ యాప్‌పై పూర్తిస్థాయిలో పట్టులేని రైతులు ఏఈవోల చుట్టూ తిరుగుతున్నా, అందుబాటులో ఉండడం లేదు. దీనికి తోడు రైతులకు రిజిస్ట్రేషన్ చేద్దామంటే యాప్ ఓపెన్ కాకపోగా, ఓటీపీ వస్తే సమయం దాటిపోయి సర్వర్‌డౌన్ అని చూపిస్తోంది. దీంతో ఒక్క రైతు రిజిస్ట్రేషన్ కోసం నాలుగు-ఐదు సార్లు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోలోందని అధికారులు వెల్లడిస్తున్నారు. పంట అమ్మకానికి సిద్ధంగా ఉన్నా రిజిస్ట్రేషన్ పూర్తికాకపోవడంతో మిల్లుల్లో నుంచి టోకెన్లు రావడంలేదని, దీంతో విక్రయాలు ఆలస్యమవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే రిజిస్ట్రేషన్ అయిన రైతుల వివరాలు 24 గంటల వరకు మాత్రమే ట్యాబ్‌లో చూపిస్తాయని, వాటిని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాల్సిన మిల్లు వద్ద ఉండే ఆపరేటర్లు చేయకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీంతో దిక్కుతోచని స్థితిలో రైతులు దళారులను ఆశ్రయించి తక్కువ ధరకు విక్రయించుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

అవగాహన కల్పించడంలో వైఫల్యం

కపాస్ కిసాన్ యాప్‌లో రైతులు వివరాలు నమోదు చేసుకోవాలని చెబుతున్న అధికారులు గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు అవగాహన కల్పించడంలో విఫలమయ్యారు. స్మార్ట్‌ఫోన్‌లో

(మిగతా 8లో..)

మండలం	క్లస్టర్లు	సాగు చేసిన రైతులు	సాగు చేసిన ఎకరాలు
చిన్నగూడూరు	2	1430	1740
దంతాలపల్లి	3	3145	5595
డోర్నకల్	4	3675	4700
కురవి	6	3596	4913
మరిపెడ	10	10818	13435
నర్సింహులపేట	03	3488	4219
పెద్దవంగర	03	3966	5269
సీరోలు	04	1588	1840
తొర్రూరు	06	4585	8441
మొత్తం	41	36,244	49,122

వారం రోజులు తిరిగినా రిజిస్ట్రేషన్ కాలేదు

సాంటిరెడ్డి మహేందర్‌రెడ్డి, రైతు, ఫత్తేపురం, తొర్రూరు మండలం



సీసీఐకి పత్తి పంటను విక్రయించుకోవాలంటే యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే వారం రోజులు అధికారుల చుట్టూ తిరిగినా కాలేదు. ఒక ఎకరాకు 7 క్వింటాళ్ల పత్తి మాత్రమే కొనుగోలు చేస్తామంటున్నారు. దిక్కుతోచని స్థితిలో దళారులను ఆశ్రయిస్తే తక్కువ ధరకు అడుగుతున్నారు. రిజిస్ట్రేషన్ అయిన రైతుల కోసం వెతుకుతున్నాను.

సాంకేతికలోపంతోనే ఇబ్బందులు

రాంనర్సయ్య, వ్యవసాయ శాఖ అధికారి, తొర్రూరు



కపాస్ కిసాన్ యాప్ సాంకేతిక లోపంతోనే రిజిస్ట్రేషన్లు పూర్తిస్థాయిలో కావడం లేదు. కార్యాలయం వద్దకు రాకుండానే రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా ప్రతీ రైతుకు అవగాహన కలిపిస్తున్నాం.

రెండోరోజూ 'మోడల్' హాస్టల్ ఎదుట విద్యార్థినుల ధర్నా

- విద్యార్థి సంఘం నాయకులను తరలించిన పోలీసులు
- అనంతరం స్కూల్ ఎదుట బాలికల బైఠాయింపు



కల్వల మోడల్ స్కూల్ వసతి గృహం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థినులు

కేసముద్రం, నవంబరు21 (ఆంధ్రజ్యోతి) : కల్వల మోడల్ స్కూల్ వసతి గృహం విద్యార్థినులు రెండోరోజూ శుక్రవారం ధర్నాకు దిగారు. అల్పాహారం, భోజనం సరిగా పెట్టడంలేదీ, నిర్వాహకులను మార్చాలని గురువారం విద్యార్థినులు ధర్నా చేసిన విషయం విధితమే. ఈ క్రమంలో డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ శ్రవణ్‌ఆధ్వర్యంలో ఉదయం వసతిగృహం, స్కూల్ భవనం ముందు ధర్నాకు కూర్చున్నారు. ఈ సందర్భంగా శ్రవణ్ మాట్లాడుతూ ఈ వసతి గృహం నిర్వాహకులతో పాటు పర్యవేక్షించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న సంబంధిత అధికారులను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ క్రాంతికిరణ్ అక్కడికి చేరుకొ ని విద్యార్థి సంఘం నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు వెళ్లిపోయిన తర్వాత మళ్లీ స్కూల్ గేటు ఎదుట విద్యార్థినులు బైఠాయించారు. ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్ విద్యార్థినులను సముదాయించి ధర్నాను విరమింపజేశారు.

కేసముద్రం సొసైటీ పాలకమండలి తిరిగి కొనసాగింపు

- హైకోర్టు ఆదేశాలతో జిల్లా సహకార అధికారి ఉత్తర్వులు



కేసముద్రం సొసైటీలో మాట్లాడుతున్న చైర్మన్ వెంకన్న

8

అణగారిన వర్గాల కోసం పోరాడేది కమ్యూనిస్టులే

- బూటకపు ఎన్‌కౌంటర్లను ఖండించాలి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



కురవిలో బస్సుజాతలో ప్రసంగిస్తున్న చాడ వెంకట్‌రెడ్డి

కురవి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అణగారిన వర్గాల కోసం నిరంతరం పోరాడేది కమ్యూనిస్టులేనని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. సీపీఐ వందేళ్ల ఉత్సవాల ప్రచారజాత శుక్రవారం కురవికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మావోయిస్టులను ఎన్‌కౌంటర్లు చేయడం అన్యాయమని, బూటకపు ఎన్‌కౌంటర్లను ప్రతీ ఒక్కరు ఖండించాలన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కలివేని శంకర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠ, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్, సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి, అజయ్‌సారథి, నెల్లూరి నాగేశ్వర్‌రావు, తురక రమేష్, బుర్ర సమ్మయ్య, బుడమ వెంకన్న, బొల్లం ఉప్పలయ్య, కలగూర నాగరాజు, అబ్దుల్ రషీద్, సమ్మయ్య, పోలెపాక వెంకన్న, దూదికట్ల సారయ్య పాల్గొన్నారు.

ప్రజాపోరాటాలను ఉధృతం చేయాలి

● గార్ల : తెలంగాణలో పేదల పక్షాన సీపీఐ ప్రజాపోరాటాలు ఉధృతం చేయాలని ఆ పార్టీ నాయకుడు వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. సీపీఐ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన బస్సుయాత్ర గార్లకు చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. సీపీఐ మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా ప్రజాఉద్యమాలు నిర్మించాలన్నారు. సీపీఐ రాష్ట్ర నాయకుడు తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు, జిల్లా కార్యదర్శి విజయసారథి, కె.శ్రీనివాస్, సారిక శ్రీనివాస్, జంపాల వెంకన్న, మాగం లోకేశ్, పాల్గొన్నారు.

28న జిల్లాస్థాయి చెకుముకి పోటీలు

- జిల్లా వ్యాప్తంగా 72 టీంల ఎంపిక



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న టౌన్ సీఐ మహేందర్‌రెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో ఈ నెల 28న జిల్లాస్థాయి చెకుముకి పోటీలు ఉంటాయని జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాహితీ శ్రీనివాస్, చొప్పరి శ్రీనివాస్ తెలిపారు. అన్ని మండల కేంద్రాల్లో శుక్రవారం మండలస్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. జిల్లాలోని 18 మండలాల పరిధిలో నిర్వహించిన పోటీల్లో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలలో 210 టీంలు పాల్గొన్నట్లు వారు పేర్కొన్నారు. మండలస్థాయిలో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రతీ మండలం నుంచి ముగ్గురు విద్యార్థులతో ఒక్కోటీం చొప్పున నాలుగు టీంలను ఎంపిక చేసి, జిల్లాలోని 18 మండలాలకు మొత్తంగా 72 టీంలను జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని గీతాంజలి హైస్కూల్‌లో నిర్వహించిన పోటీల ముగింపు సమావేశానికి మానుకోట టౌన్ సీఐ మహేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర నాయకులు తడకమల్ల బ్రహ్మం, గీతాంజలి గ్రూపు ఆఫ్ స్కూల్స్ చైర్మన్ వేములపల్లి సుబ్బారావు, డైరెక్టర్ రామకృష్ణ, జేవీవీ బాధ్యులు సునిత, మైస నాగయ్య, ఉమాదేవి, యాకయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు 6వేల బస్తాల ధాన్యం రాక

ఆర్ఎన్ఆర్ క్వింటాకు గరిష్ఠ ధర రూ.2,691

8

యూరియా ఇష్టానుసారం వాడొద్దు

దంతాలపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : యాసంగి సాగులో రైతులు యూరియాను కృత్రిమ కొరత సృష్టించి, అధిక మొత్తంలో ఎరువులను వాడడంతో పంట దిగుబడి పొందలేరని వ్యవసాయాధికారి వాహిని అన్నారు. శుక్రవారం ఆమె మండల కేంద్రంతో పాటు గున్నేపల్లి, పెద్దముప్పారం రైతు వేదికలో మాట్లాడారు. రైతులు యూరియాతో పాటు ఇతర పెస్టిసైడ్స్‌లను అధికారుల సలహా, సూచనల మేర మేరకే వాడాలన్నారు. ఇక క్లస్టర్ వారీగా ఎరువుల ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో దీక్షిత్ కుమార్, ఉదయ్ కుమార్, పీఏసీఎస్ సీఈవో వెంకన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు రైతు మృతి


భాను (ఫైల్)

నర్సింహులపేట (మహబూబాబాద్ క్రైం), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముంగిమడుగు శివారు బొడ్డితండ సమీపంలోని ఆకేరు వాగులో ఓ రైతు ప్రమాదవశాత్తు పడి మృతిచెందినట్లు ఎస్సై సురేశ్ శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బొడ్డితండాకు చెందిన అంగోతు భాను (52) వ్యవసాయ పనుల కోసం వడ్లపై టార్పాలిన్ పట్టా కప్పేందుకు టార్పాలిన్ పట్టా తీసుకువెళ్తున్న క్రమంలో ఆకేరు వాగులో కిందపడి మృతి చెందాడు. మృతుడి భార్య సత్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కొరిపెల్లివాసికి డాక్టరేట్


సుధీర్‌కుమార్

పెద్దవంగర, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో ని కొరిపెల్లి గ్రామానికి చెందిన బొచ్చుల సుధీర్‌కుమార్ శుక్రవారం ఉస్మానియా యూనివర్శిటీ నుంచి ఎకనామిక్స్ లో డాక్టరేట్ పట్టా పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాల యంలో ఎకనామిక్స్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ జాడి నరసింహారావు పర్యవేక్షణలో తెలంగాణ చేనేత పరిశ్రమ సామాజిక - ఆర్థిక విశ్లేషణ అనే అంశంపై పరిశోధనలు నిర్వహించారు. సమర్పిం చిన పరిశోధన గ్రంథాన్ని పరిశీలించిన అధికారులు డాక్టరేట్ ప్రకటించారు. ఈ సందర్భంగా సుధీర్‌కుమార్ మాట్లాడుతూ డాక్టరేట్ పట్టా సమాజం పట్ల తన బాధ్యతను మరింత పెంచిందని, సమాజ శ్రేయస్సు కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

యతిరాజారావు పార్కు సమస్యలు పరిష్కరించాలి

తొర్రూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఉన్న యతిరాజారావు పార్కులోని సమస్యలను పరిష్కరించాలని పార్కు ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్తి రవీందర్ ఆధ్వర్యంలో శుక్రవారం మునిసిపల్ కమిషనర్ శ్యాం సుందర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఇ.నాగిరెడ్డి, కె. యాకయ్య, బి. మహేష్, టి.బిక్షం, రవి, రాములు, మంగమ్మ, సోమనర్సయ్య, బాలాజి, భాస్కర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

సీఐటీయూ మండల కన్వీనర్‌గా యాకన్న



చిన్నగూడూరు (మరిపెడ), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ చిన్నగూడూరు మండల కన్వీనర్‌గా బోయిని యాకన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం ఆ సంఘం బాధ్యులు సమావేశమై మండల కమిటీ ఎన్ను కున్నట్లు ఆ సంఘం జిల్లా బాధ్యులు కుంట ఉపేందర్, గునిగంటి మోహన్‌లు స్థానిక విలేకరులతో మాట్లాడారు. కోకన్వీనర్‌గా వెంకటరత్నం (ఏడబ్ల్యూటీ),సభ్యులుగా రహీం పాషా, మన్నె జ్యోతి, మూల జ్యోతి, వెంకన్న, కంచనపల్లి గణేశ్ ఎన్నికైనట్లు పేర్కొన్నారు. సమావేశంలో దుండి వీరన్న, ఉప్పలయ్య, రాజు, వెంకన్న పాల్గొన్నారు.

సర్వీస్ టీచర్లకు టెట్ రద్దు చేయాలి

మరిపెడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సర్వీస్ టీచర్లకు టెట్ రద్దు చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం టీఎస్ యూటీఎఫ్ మరిపెడ మండల మహాసభ స్థానికంగా జరుగగా ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం 2011కు ముందు ఉపాధ్యాయులకు టెట్ అవసరం లేదని చెప్పి ఇప్పుడు టెట్ కంపనిసరి అని చెప్పడం శోచనీయమని విమర్శించారు. ఆ సంఘ నాయకులు నామా వెంకటేశ్వర్లు, నందిగామ జనార్ధనాచారి, ఎండి.అబ్దుల్ అజీజ్, లింగానాయక్, ప్రభాకర్, నాగరాజు, రంజిత్, నెహ్రూ పాల్గొన్నారు.

శాస్త్రీయ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి


తొర్రూరులో బహుమతి ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

తొర్రూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే పిల్లలు శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎంఈవో బుచ్చయ్య, లయన్స్ క్లబ్ చార్టర్డ్ ప్రెసిడెంట్ డాక్టర్ కె. రాజేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం జనవిజ్ఞాన వేదిక తొర్రూరు మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించి టాలెంట్ టెస్ట్, సైన్స్ సంబరాలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వివిధ ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల నుంచి 21 టీమ్‌లు పాల్గొని పరీక్షలు రాశారు. వీరిలో ప్రభుత్వ విభాగంలో కేజీబీవీ పాఠశాల, ఇంగ్లీష్ మీడియంలో మోడల్‌స్కూల్ గుర్తూరు, ద్వితీయ స్థానంలో మాటేడు హైస్కూల్, గురుకులాల్లో సోషల్ వెల్ఫేర్‌పాఠశాల, ప్రైవేటు ఇంగ్లీష్ మీడియంలో లిటిల్ ఫ్లవర్ హైస్కూల్, రెండవ బహుమతి నలంద స్కూల్ విద్యార్థులు గెలుపొందినట్లు తెలిపారు. ప్రతిభ కనబర్చిన వారికి ఈ నెల 28వ తేదీ జిల్లా స్థాయిలో పోటీ పరీక్షలుంటాయన్నారు. గెలుపొందిన వారికి బహుమతి ప్రదానంచేశారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు టి.రమేశ్, ఆర్.యాకయ్య, మచ్చ సురేశ్, జ్యోతి, బ్రహ్మానంద రెడ్డి, ముత్తిలింగం, వెంకన్న, రేణుకాదేవి, సుధాకరాచారి, ప్రేమలత, విద్యార్థులు ఉన్నారు.

● మరిపెడ (ఆంధ్రజ్యోతి) : టాలెంట్ టెస్ట్ పరీక్షలు విద్యార్థుల మెదడకు పదునులాంటివని మరిపెడ సీఐ ఎస్.రాజ్‌కుమార్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మరిపెడ మండల జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన మండల స్థాయి చెక్‌ముకి టాలెంట్ టెస్ట్ పరీక్షలను ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించగా, సీఐ ముఖ్యఅతిథిగా పోటీ పరీక్షల ప్రశ్న పత్రాలను విడుదల చేశారు. మండలంలోని 18 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా చిల్లంచర్ల, సెయింట్ ఆగస్టీన్, సోషల్ వెల్ఫేర్, వీరారం హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ నెల 28న జిల్లాస్థాయి పోటీలలో ఈ విద్యార్థులు పాల్గొంటారు. స్థానిక ఏడీఎంఎస్ యజమాని రహీమొద్దీన్, అడ్వకేట్ రవీందర్, మరిపెడ సోషల్ టీచర్ శ్రీశైలం పరీక్షల నిర్వాహణకు తమ వంతు సహాయం అందచేశారు. జనవిజ్ఞాన వేదిక బాధ్యులు రాం మోహన్, నవీన్, సుభాన్, రాంచంద్రయ్య, వీరన్న పాల్గొన్నారు.

● పెద్దవంగర (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు చెకుముకి పోటీలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి హెచ్‌ఎం రాజలింగం అన్నారు. శుక్రవారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో 8, 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలస్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. మండల స్థాయి ప్రతిభ కనబర్చిన విద్యార్థులు జిల్లాస్థాయిలో పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు కొక్కుల శ్రీధర్, కవిరాజు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోలి పాడ్యమి

మరిపెడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలి పాడ్యామి వేడుకలను మరిపెడ పట్టణ మహిళలు శుక్రవారం మరిపెడబంగ్లాలోని రామాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్తీక మాస అమవాస్య అనంతరం మార్గశిర మాస తొలి పాడ్యామిని పోలి పాడ్యామిగా భావించి తులసి మొక్క దగ్గర దీపాలు వెలిగించి పూజలు చేస్తే ఇంటింటా లక్ష్మీకటాక్షం లభిస్తుందని మహిళల అపార నమ్మకం. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సుదర్శన్ భట్టార్ దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు జరిపి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందచేశారు.

మోడల్ స్కూల్ సమస్యలు పరిష్కరించాలి


అదనపు కలెక్టర్ అనిల్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మండలం కల్వల మోడల్ స్కూల్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐజిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంధసిరి జ్యోతిబసు, పట్ల మధు డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లో శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ అనిల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలనే డిమాండ్‌తో గత రెండు రోజులుగా దర్నాలు చేస్తున్నా పట్టించుకోవడంలేదన్నారు. వెంటనే అధికారులు మోడల్ స్కూల్‌ను సందర్శించి విద్యార్థుల సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి, పవన్, తాజ్ నవీన్, జస్వంత్, సన్నీ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం

పెద్దవంగర, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోచంపల్లి, అవుతాపురం గ్రామాల్లో శుక్రవారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా మత్స్యకారుల జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మత్స్యకారుల సంఘం నాయకులు కనుకుంట్ల వెంకన్న, కనుకుంట్ల నరేశ్ మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి, మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలన్నారు. ముదిరాజులు ఐక్యంగా ఉండి అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్లప్ప, వెంకన్న, నాగరాజు, నరసింహులు, ముత్తిలింగం, నారాయణ, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నగూడూరు (మరిపెడ) (ఆంధ్రజ్యోతి) : ముదిరాజ్ కులస్థులను బీసీ ఏ లో చేర్చాలని చిన్నగూడూరు మత్స్య సొసైటీ బాధ్యుడు కోల శ్రీను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ముదిరాజ్ భవన్ వద్ద జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో చాట్ల రాంచంద్రు, బత్తెం రమేశ్ తదితరులు పాల్గొన్నారు. జయ్యారంలో అక్కడి సొసైటీ అధ్యక్షుడు మారబోయిన వెంకటేశ్వర్లుముదిరాజ్ జెండాను ఆవిష్కరించారు.

మండల వ్యాప్తంగా 26,683 ఓటర్లు

దంతాలపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 18గ్రామ పంచాయతీ పరిధిలో 26,683 ఓటర్లుగా గుర్తించినట్లు ఎంపీడీవో విజయ పేర్కొన్నారు. శుక్రవారం ఆమె మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతూ మొత్తం 166 వార్డులో 26,683 ఓటరులు ఉండగా, మేజర్ గ్రామ పంచాయతీగా పెద్దముప్పారం, దాట్ల, దంతాలపల్లి, తక్కువ ఓటరు ఉన్న జీపీగా లక్ష్మీపురం జీపీ ఉందన్నారు. లక్ష్మీపురం జీపీలో 213 ఓట్లు ఉండగా పెద్దముప్పారం మేజర్ జీపీలో 4,864 ఓటరులు ఉన్నారు. ఈ నెల 20, 21న వచ్చిన ఫిర్యాదులను పరిష్కరిస్తామన్నారు. నవంబరు 23న డీపీవోతో ఓటరు లిస్టు జాబితను విడుదల చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మహ్మద్ అప్సరపాషా, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


గుడి నిర్మాణానికి విరాళం ఇస్తున్న దాట్ల మాజీ ఎంపీటీసీ సతీష్

దంతాలపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండ లంలోని దాట్ల గ్రామంలో నిర్మిస్తున్న యాదవుల ఆరా ధ్య దైవమైన లింగమంతుల స్వామి ఆలయ నిర్మాణానికి శుక్రవారం తాజా మాజీ ఎంపీటీసీ కొమ్మినేని సతీష్ రూ.25వేల చెక్కును అం దించారు. కార్యక్రమంలో యాదవ కుల నాయకులు లింగల్లు, రాజయ్య, కిష్టయ్య, లింగయ్య, ఆవుల సోమయ్య, మహేశ్, దేవేందర్, రమేశ్ పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

దంతాలపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఖమ్మం-వరంగల్ జాతీయ రహదారిపై శుక్రవారం ఎస్సై పిల్లల రాజు ఆధ్వర్యంలో విస్తృత వాహనాల తనిఖీ నిర్వహించారు. వరంగల్, ఖమ్మం, సూర్యాపేట, వరంగల్ వైపు నుంచి వచ్చే వివిధ రకాల వాహనాలను ఆకస్మికంగా తనిఖీలు చేసి పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు తప్పక సంబంధిత వాహనాల పత్రాలను అందుబాటులో ఉంచుకొని వాహనాలను నడపాలన్నారు. లేనిచో చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి లైసెన్స్ రద్దుకు సిఫారస్సు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తుల ఆహ్వానం

పెద్దవంగర, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైయివేట్ పాఠశాలలో 5 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న (ప్రీమెట్రిక్) విద్యార్థులు స్కాలర్ షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖాఅధికారి బుధారపు శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైయివేట్ పాఠశాలలో 5నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు 2025-26 స్కాలర్‌షిప్ కోసం ఈనెల 25వరకు https:// telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలన్నారు. ఆన్ లైన్ దరఖాస్తు ఫామ్, విద్యార్థుల ఆధార్ కార్డు, కులం, ఆదాయ ధృవీకరణ పత్రం, పాస్‌పోటో , బ్యాంకుఖాతా తదితర ధృవపత్రాలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేయాలన్నారు.

ఘనంగా శివాలయం వార్షికోత్సవం

మరిపెడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని హరిహరా పుత్ర అయ్యప్పస్వామి- మల్లిఖార్జుభ్రమరాంబిక ఆలయ 26వ వార్షికోత్సవాన్ని భక్తులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం దేవతామూర్తులకు రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు తరలివచ్చి శివపార్వతులను దర్శనం చేసుకొని పూజలు చేశారు. ఆ ఆలయ అర్చకుడు బుక్కమఠం నవీన్ ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు జరిపి భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఆ ఆలయ నిర్వాహకులు మణికంఠ, లక్ష్మారెడ్డి, ఉపేందర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మేడారానికి ముందస్తు ఏర్పాట్లు


పోలీసులకు భద్రతా సూచనలు చేస్తున్న ఎస్సై శ్రీకాంత్ రెడ్డి

జాతరలో భద్రత కట్టుదిట్టం

తాడ్వాయి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వనదేవతలు సమ్మక్క సారలమ్మలను ముందస్తుగా దర్శించుకోవడానికి మేడారం తరలివస్తున్న భక్తులకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నమని ఎస్సై శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం టీఎస్‌పీసీ పోలీసులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. దేవస్థానంలో, ముఖద్వారాల వద్ద, ప్రధాన కూడలిలో, చెక్‌పోస్టుల వద్ద రెక్కీ నిర్వహిస్తు భక్తులకు సహకరించే విధంగా విధులు నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో 50 మంది టీఎస్‌పీసీలు, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.

మేడారం భక్తులకు మెరుగైన ప్రయాణం

ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారానికి టీజీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజియన్ ఆధ్వర్యంలో భక్తులకు మెరుగైన ప్రయాణ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు వరంగల్ రీజియన్ మేనేజర్ విజయబాను తెలిపారు. అయితే మేడారం వనదేవతలు సమ్మక్క సారలమ్మలను దర్శించుకోవడానికి వస్తున్న భక్తులకు ఎక్స్‌ప్రెస్ సర్వీసులను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు.

మేడారంలో ఆర్టీసీ సౌకర్యాల పనులు ప్రారంభం

2026 జనవరి 28వ తేదీ నుంచి 31వరకు మేడారంలో జరిగే మహా జాతరకు ఆర్టీసీ ప్రయాణ సౌకర్యం ఉపయోగించుకొని వచ్చే భక్తుల సౌకర్యాల పనులను టీజీఎస్ ఆర్టీసీ శాఖ ఆధ్వర్యంలో ప్రాంగణం చదును పనులు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో భక్తులకు టికెట్ కౌంటర్లు, విశ్రాంతి షెడ్‌లు, ప్లాట్‌ఫామ్‌లు, సిబ్బంది వసతి వంటి తాత్కాలిక నిర్మాణ పనులు చేపట్టనున్నారు.


గద్దెల నిర్మాణంపై రాతి శిలలు ఏర్పాటు చేస్తున్న కార్మికులు

పునర్ ప్రతిష్ఠాపన గద్దెలకు రాతి నిర్మాణ పనులు

మేడారంలో జరుగుతున్న సమ్మక్క సారలమ్మల దేవస్థానం అభివృద్ధి పనుల్లో భాగంగా పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెల పునరుద్దరణ బేస్‌మెంట్ పనులు ముగిశాయి. అంతేకాకుండా రాతి నిర్మాణ పనులను అధికారులు చేపట్టారు. మహాజాతరకు సమయం దగ్గర పడుతున్న క్రమంలో అధికారులు పనుల్లో వేగం పెంచారు గద్దెల పునర్ ప్రతిష్ఠాపన చేసేందుకు పనులు వేగంగా పూర్తి చేస్తున్నారు. శుక్రవారం వరకు రాతి శిలలు గద్దెలపై నిలిపారు. మరో వారం రోజుల్లో గద్దెల పునర్నిర్మాణం పూర్తవుతుందని అధికారులు తెలిపారు.

విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లిటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సంక్షేమంపై నిర్వాహకులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ జిల్లా కోఆర్డినేటర్లు, వసతి గృహాల పర్యవేక్షణ ప్రత్యేక అధికారులు, అన్ని రెసిడెన్షియల్, వసతి గృహాల ప్రిన్సిపల్స్, హెచ్‌ఎంలు, ఎస్‌వోలు, హెచ్‌డబ్ల్యూవోలు, పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డైట్, కాస్మోటిక్ చార్జీలు పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. ఇంతకుముందు ప్రతి శుక్రవారం ఫుడ్‌విత్ చిల్డ్రన్ కార్యక్రమం నిర్వహించామని, అది అమలు జరగడం లేదని అన్నారు. ఇకనుండి తూచా తప్పకుండా అమలు చేయాలని అన్నారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. బాలికల వసతి గృహాల్లో తప్పక సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్, బీసీ, ఎస్సీ సంక్షేమ అధికారి ఇందిరా, కాటారం డీఎస్పీ సూర్యనారాయ ణ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నవీన్‌రెడ్డి, వసతి గృహాల పర్యవేక్షణ ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ప్రిన్సిపాల్స్ వసతి గృహాల సంక్షేమ అధికారులు పాల్గొన్నారు

మేడారంలో లంబాడీల అక్రమ నిర్మాణాలను తొలగించాలి


ఐటీడీఏ కార్యాలయంలో మాట్లాడుతున్న రవి

ఏటూరునాగారం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క-సారాలమ్మ ఆదివాసీల పవిత్ర గడ్డ అని, మేడారంలోకి అక్రమంగా వలస వచ్చిన లంబాడీల నిర్మాణాలను తక్షణమే తొలగించాలని ఆదివాసీ విద్యార్థి సంఘం(ఏఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల రవి డిమాండ్ చేశారు. శుక్రవారం మండలకేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో ఏఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోర్నిబెల్లి గణేష్ అధ్యక్షతన నిర్వహించిన పత్రికా సమావేశంలో రవి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దాదాపు 20 సంవత్సరాల క్రితం మేడారంలోకి ఒక కుటుంబంతో మొదలైన లంబాడీల వలసలు క్రమంగా పెరుగుతూనే ఉన్నాయని, స్థానిక ఆదివాసీల అమాయకత్వాన్ని నిర్మిణాలు చేపడుతున్నారని ఆరోపించారు జిల్లా కలెక్టర్, స్థానిక తహసీల్దార్ వెంటనే స్పందించి మేడారంలోని లంబాడీల అక్రమ నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే, ఆదివాసీ సంఘాలు, ఆదివాసీ విద్యార్థి సంఘం నుంచి తీవ్ర ఆగ్రహ జ్వాలలు వస్తాయని, గతంలో 2017 డిసెంబరు 17న ఏం జరిగిందో మళ్ళీ అదే జరగక తప్పదని హెచ్చరించారు. మేడారం నుంచి లంబాడీలను తరిమికొట్టడానికి స్థానిక యువత సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకులు అలం స్వామి, వెంకటేష్, మోకాళ్ళ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధులను ప్రతి ఒక్కరూ గౌరవించాలి

అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవంలో అదనపు కలెక్టర్


వయోవృద్ధులను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్ సంపత్‌రావు, అధికారులు

ములుగు కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వయో వృద్ధులను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, వారి హక్కులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని అదనపు కలెక్టర్ సంపత్‌రావు అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో శుక్రవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వయోవృద్ధులు కుటుంబ వ్యవస్థకు మూలాధారమని, వారి సంరక్షణ కోసం 2017లో తీసుకువచ్చిన చట్టాన్ని 2022లో సవరించడం జరిగిందని అన్నారు. ఈ చట్టం ప్రకారం జిల్లాలోని వయోవృద్ధులకు ఏమైనా సమస్యలు ఉంటే ఆర్డీవోకు ఫిర్యాదు చేయాల్సి ఉంటుందని, ఆ సమస్య పరిష్కారం కాని పక్షంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. వయోవృద్ధుల సంక్షేమ ఫోరం జిల్లా అధ్యక్షుడు పాశం రామ్మూర్తి మాట్లాడుతూ జిల్లా వయోవృద్ధుల సంక్షేమశాఖ తరపున వయోవృద్ధులకు వివిధ అంశాల్లో వివిధ క్రీడా పోటీలు, కవితాపోటీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. వయోవృద్ధుల సంరక్షణ, సంక్షేమం కోసం కట్టుబడి ఉంటామని అధికా రులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం క్రీడాపోటీల్లో విజేతలుగా నిలిచిన వయో వృద్ధులను శాలువాలతో సన్మానించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వయోవృద్ధుల జిల్లా ఫోరం నాయకులు, ములుగు, ఏటూరునాగారం సీడీపీవో కె.శిరీష, ఈపీ ప్రేమలత, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, చుంచు రమేష్, డీసీపీవో ఓంకార్, వృద్ధుల సంక్షేమశాఖ ఇన్‌చార్జి నాగేంద్ర, ఎఫ్‌ఆర్‌వో గణేష్, డీఎంసీ రమాదేవి పాల్గొన్నారు.

పథకం పడావు



అటకెక్కిన పశుగ్రాసం పెంపకం

- ఒక్క లబ్ధిదారుడికి కూడా అందని సబ్సిడీ
- ట్రెజరీ అధికారుల తీరుతో నీరుగారిన లక్ష్యం
- బిల్లులు ఉంటేనే విడుదలంటూ మెలిక
- మురిగిపోయిన రూ. 4 కోట్ల నిధులు

హనుమకొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పశుపోషణకు రైతులు పడావు భూముల్లో పశుగ్రాసం పెంచుకునేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రత్యేక పథకం.. రెవెన్యూ, ట్రెజరీ అధికారుల తీరు వల్ల అమలుకు నోచుకోవడం లేదు. నాలుగేళ్ల కిందట అమలులోకి వచ్చిన ఈ పథకం కోసం కేంద్రం నిధులు ఇస్తున్నా అమలు కావడం లేదు. ఇతర జిల్లాల్లో విజయవంతంగా అమలవుతున్నా.. ఉమ్మడి వరంగల్ జిల్లాలో అధికారుల మధ్య సమన్వలోపంతో పడావుపడుతోంది. దీంతో రైతులు పశుగ్రాసం కొరతతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.

పశుగ్రాసం కొరత

ఆరుగాలం రైతులకు వ్యవసాయంలో తోడ్పడే కాడెద్దులకు మేత కరవవుతోంది. ఇంటా, బయట పశుగ్రాసం దొరక్క మూగజీవాలు అంబా అంటున్నాయి. కాడెద్దులకు పశుగ్రాసం దొరకకపోవడంతో దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. కొందరు ఆర్థిక భారమైన వేలకు వేలు ఖర్చుపెట్టి గడ్డిని కొని పశువులను సాకుతున్నారు. ఉమ్మడి జిల్లాలో పశువులకు సంపదకు సరిపడా పశుగ్రాసం దొరకడం లేదు. ఉన్న కొద్దిపాటి మేత ప్రియమైంది. గతంలో సాగునీరు అందుబాటులో లేక ఉమ్మడి జిల్లాలో చాలా చోట్ల భూములు పడావు పడి ఉండేవి. అక్కడ గడ్డి విస్తారంగా పెరిగేది. పశువులకు కావలసినంత మేత లభించేంది. పశువులతో పాటు గొర్రెలు, మేకలకు సైతం గడ్డి దొరికేది. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. సాగునీరు అందుబాటులోకి వచ్చిన తర్వాత సాగునీరు పుష్కలంగా అందుబాటులో వచ్చింది. దీంతో క్రమంగా పడావు భూములు సైతం పచ్చని పొలాలుగా మారిపోయాయి. దీనితో పశువులకు మేయడానికి పచ్చగడ్డి దొరకని పరిస్థితి ఏర్పడింది. రెవెన్యూ అధికారులు కూడా పడావు భూములు చూపలేకపోతున్నారు.

మురిగిపోయిన నిధులు

పథకం లక్ష్యం బాగానే ఉంది కానీ.. ఎటొచ్చి అమలులోనే చిక్కులు ఎదురవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలకు ఈ పథకం కింద గతంలో రూ.4కోట్లు మంజూరయ్యాయి. నిధులు కూడా విడుదలయ్యాయి. లబ్ధిదారులను ఎంపిక చేసే ముందు పడావు భూములు ఎక్కడెక్కడ.. ఎంత విస్తీర్ణంలో ఉందో తెలుసుకోవడమే కాకుండా పశుగ్రాసం పెంచడానికి ఆ నేలలు ఎంత మేరకు అనువైనవో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులు నిర్ధారించుకోవలసి ఉంటుంది. ఈ మేరకు జిల్లా రెవెన్యూ అధికారులకు లేఖలు రాశారు. హనుమకొండ జిల్లాలో అసలు పడావు భూములు లేవనే సమాధానం అధికారుల నుంచి వచ్చింది. దీనితో ఈ జిల్లాలో ఈ జిల్లాలో పథకం అమలే కాలేదు.

ట్రెజరీల మెలిక

మిగతా వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో పశుసంవర్ధక శాఖ అధికారులు ఈ పథకం అమలుకు ప్రయత్నా లు చేశారు. కానీ లబ్ధిదారులు ముందు గా తమ సొంత ఖర్చుతో పశుగ్రాసం చేపట్టి బిల్లులు పెట్టిన తర్వాతనే బిల్లులు పాస్ చేస్తామని ట్రెజరీ అధికారులు మెలికపెట్టడంతో పశుసంవర్ధక శాఖ అధికారు లు ఏం చేయలేని పరిస్థితి ఏర్పడింది. పడావు భూముల్లో ఒక హెక్టారులో పశుగ్రాసం పెంచుకోవడానికి ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం 100 శాతం సబ్సిడీతో రూ.లక్ష ఇస్తుంది. పశుగ్రాసం పెంచడానికి చాలామంది ముందుకు వచ్చినా ఖర్చు పెట్టిన తర్వాతే బిల్లులు అనే సరికి వెనక్కితగ్గారు. సాధారణంగా ఏ పథకం కింద అయినా నిధులు మంజూరైతే సంబంధిత శాఖ అధికారుల ఖాతాల్లో అవి జమ కావాలి. అపుడు తమ వద్ద అందుబాటులో ఉన్న నిధులను బట్టి లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి మంజూరు ఇస్తారు. కానీ ఇక్కడ ట్రెజరీ అధికారులు బిల్లులు పెడితేనే నిధులను విడుదల చేస్తామనే సరికి పథకం అమలుకాక లక్ష్యం నీరుగారింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో నాలుగేళ్లుగా ఈ పథకం అమలుకు నోచుకోవడం లేదు. దీంతో పడావు భూమిలో గడ్డిని పెంచేందుకు ఆసక్తి ఉన్నవారు ముందుకు వచ్చిన ప్రయోజనం లేకుండా పోయింది.

పథకం ఇలా..

పడావు భూముల అభివృద్ధి పథకం కింద కేంద్ర ప్రభుత్వం వంద శాతం రాయితీ అందిస్తోంది. మూడేళ్లపాటు నిరంతరాయంగా గ్రాసం అందేలా విత్తనం ఎంపిక చేసుకోవాలి. ధాన్యపు జాతి, పప్పుజాతి, గడ్డి జాతి పశుగ్రాసాలతో పాటు లూసర్న్, అవిశ, గంగరావి వంటి మొక్కలు నాటు కోవచ్చు. గుర్తించిన భూమిలో నీటి లభ్యత లేనట్లయితే బోరు వేసుకోవాలి. పెంచుతున్న గ్రాసాన్ని సంరక్షించుకునేందుకు చుట్టూ బయోఫెన్సింగ్ వేసుకోవాలి. లబ్ధిదారుల ఎంపికలో ఎస్సీలు 15శాతం, ఎస్టీలు 8శాతం మందికి అవకాశం కల్పిస్తారు.

అటకెక్కిన పథకం

పడావు భూముల్లో పశుగ్రాసం పారదర్శకంగా పెంచేందుకు పరిరక్షణకు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలి. కానీ అసలు పథకమే అమలు కాకపోవడంతో ఈ కమిటీల ఏర్పాటు కూడా జరగలేదు.

ఈ యేడు కూడా ఇప్పటి వరకు పథకం అమలుకు సంబంధించిన రీవాలిడేషన్ రాకపోవడం వల్ల అమలు అవకాశాలు కనిపించడం లేదు. అయితే కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిధుల విడుదల విషయంలో చేసిన కొన్ని మార్పుల వల్ల భవిష్యత్తులో ఈ పథకం అమలులో ఇబ్బందులు తొలగవచ్చునని తెలుస్తోంది. భవిష్యత్తులో ఆయా పథకాల కింద లబ్ధిదారులకు సబ్సిడీని నేరుగా పీఎఫ్ఎంఎస్ విధానంలో నేరుగా వారి ఖాతాలోనే జమ చేయాలని నిర్ణయం తీసుకోవడం వల్ల ట్రెజరీ అడ్డంకులు ఉండకపోవచ్చునని తెలుస్తోంది.

రూ.లక్ష సబ్సిడీ



పశువులకు గ్రాసం కొరత రాకుండా భవిష్యత్తులో మేతను అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో కేంద్రం పడావు భూముల్లో పశుగ్రాసం పెంపకానికి ప్రత్యేక పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. గ్రామాల్లో పడావు భూములను అభివృద్ధి చేసుకొని కావలసిన గ్రాసం పెంచుకునేందుకు రైతులకు అవకాశం కల్పించింది. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో 400 యూనిట్లు మంజూరు అయ్యాయి. అవసరమైన రాయితీని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి అనుసంధానం చేసి ఇస్తారు. పశువులు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో జీవాలు పెద్ద సంఖ్యలో ఉంటే ఆహారం సరిపోక వలసలు వెళ్లాల్సి వస్తోంది. ఈ పథకం ద్వారా దీనిని నివారించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పడావు భూములు సుమారు 42 వేల ఎకరాల వరకు ఉంటాయని అధికారుల అంచనా. ఇటీవల నీటి వనరులు సమృద్ధిగా అందుబాటులోకి వచ్చిన తర్వాత వీటితో పాటు గుట్టలు, రాళ్ల, రప్పలు ఉన్నచోట కూడా సాగులోకి తెస్తున్నారు. ఒక దశలో పశువులు మేత కోసం సంచరించేందుకు ఖాళీ స్థలాలు లేకుండా పోయాయి. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని పడావు భూముల్లో గ్రాసం పెంచినట్లయితే ఈ పథకం ద్వారా పశువులకు ప్రయోజనం చేకూరుతుందని పశుసంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు.

సెంట్రల్‌జైలు నిర్మాణం ఏదీ!?

- పాత భవన సముదాయం కూల్చివేసి నాలుగున్నరేళ్లు
- పట్టించుకోని పాలకులు



వరంగల్ సెంట్రల్ జైలు పాత చిత్రం.. (ఫైల్)

మామునూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే పేరుగాంచిన వరంగల్ సెంట్రల్ జైలు కనుమరుగై నాలుగున్నరేళ్లు అవుతోంది. స్వాతంత్ర్యానికి పూర్వం నిజాం రాజులు నిర్మించిన ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు, నిజాం రాజులకు వ్యతిరేకంగా పనిచేసిన వారు, తెలంగాణ ఉద్యమకారులు, మావోయిస్టు అగ్రనేతలు లాంటివారెందరో ఇందులో శిక్ష అనుభవించారు. ఎంతో మంది ఖైదీలకు జీవిత పాఠాలు నేర్పిన ఘనమైన చరిత్ర ఈ కారాగారానికి ఉంది. 1886లో నిజాంలు నిర్మించిన ఈ భవనాన్ని సూపర్ స్పెషాలిటీ నిర్మాణం కోసం 2021 జూన్‌లో కూల్చివేశారు. మొత్తం 66 ఎకరాల్లో విస్తీర్ణంలో పరిపాలన భవనం, ఖైదీల బ్యారక్‌లు, హైసెక్యూరిటీ బ్యారక్‌లు, ఖైదీల ఉపాధి కోసం ఏర్పాటు చేసిన కర్మాగారాలు ఉండేవి. ఆ తర్వాత మామునూరులో అత్యాధునిక హంగులతో నూతన సెంట్రల్ జైలును రెండేళ్లలో నిర్మిస్తామని చెప్పింది. జైల్లో ఉన్న దాదాపు వెయ్యి మంది ఖైదీలను ఇతర జైళ్లకు తరలించింది. కాని భవనాన్ని నిర్మించలేదు. తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పట్టించుకోవడం లేదు. పాత సెంట్రల్ జైలు భవనంలో ఉన్న ఖైదీలను వారి కుటుంబ సభ్యులు అప్పుడో ఇప్పుడో కలుసుకునేవారు. ఇప్పుడు వారు దూర ప్రాంతాల్లో ఉండడంతో అక్కడికి వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. ఇప్పటికైనా వరంగల్ సెంట్రల్ జైలు నిర్మించాలని ఖైదీల కుటుంబసభ్యులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

20 మంది ఖైదీలకు 40 మంది సిబ్బంది..

వరంగల్ మామునూరులో సెంట్రల్ జైలు నిర్మాణం కోసం (టీఎస్ఎస్‌పీ) 4వ బెటాలియన్ క్యాంపస్ పక్కన 101 ఎకరాల స్థలం కేటాయించినప్పటికీ నిర్మాణం కోసం ఎలాంటి బడ్జెట్ కేటాయించనట్లు తెలుస్తోంది. పైగా 20 మంది ఖైదీలకు 40మంది పోలీసులు పనిచేస్తున్నారు. మామునూరులో 20 మంది ఖైదీలు ఉండగా 40మంది ..ఒక డీఎస్పీ, ఒక జైలర్, ఒక డిప్యూటీ జైలర్ ఇంకా సీనియర్ పోలీసులు ఇక్కడ పనిచేస్తున్నట్లు తెలిసింది.

మతిస్థిమితం లేని బాలికపై అత్యాచారం

- నిందితుడు 70 ఏళ్ల వృద్ధుడు
- బాధితురాలికి వరుసకు పెదనాన్న
- ములుగు జిల్లాలో ఆలస్యంగా వెలుగుచూసిన దారుణం

వెంకటాపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అతడు 70 ఏళ్ల వృద్ధుడు.. కానీ కామంతో కళ్లు కుమూసుకు పోవడంతో వావి వరుసలు మరిచాడు. వరుసకు కూతురు అయ్యేమతిస్థిమితం లేని 15 ఏళ్ల బాలికపై అత్యాచారానికి ఒడిగట్టాడు. ఈ సంఘటన ములుగు జిల్లాలో ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికుల కథనం ప్రకారం.. వెంకటాపూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన దంపతులు ఊరూరు తిరుగుతూ వంట సామగ్రి విక్రయిస్తుంటారు. వీరికి 15 ఏళ్ల కూతురు ఉంది. ఈమెకు మతిస్థిమితం లేకపోవడంతో ఇంట్లోనే ఉంటోంది. ఈ క్రమంలో అదే గ్రామంలో 15 రోజుల క్రితం వరుసకు పెదనాన్న అయ్యే 70 ఏళ్ల వృద్ధుడు ఒంటరిగా వున్న బాలికపై అత్యాచారం జరిపాడు. ఈ విషయాన్ని బాలిక తన తల్లిదండ్రులకు తెలుపడంతో కులపెద్దలు పంచాయితీ పెట్టారు. చివరకు రూ.6 లక్షలు బాధిత బాలిక కుటుంబానికి ఇవ్వాలని, మరో రూ.2లక్షలు కులసంఘ పెద్దలకు ఇవ్వాలని తీర్మానించారు. ఇందుకు అత్యాచారానికి పాల్పడినవృద్ధుడు కూడా అంగీకరించినట్లు తెలిసింది. అయితే ఒప్పుకున్నవిధంగా వృద్ధుడు బాలిక కుటుంబానికి రూ.6లక్షలు, పెద్దమనుషులకు రూ.2లక్షలు ఇవ్వకపోవడంతో విషయం బయటకు పొక్కింది. ఈ క్రమంలో బాలిక తల్లిదండ్రులు శుక్రవారం వెంకటాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై స్థానిక పోలీసులను సంప్రదించగా ఫిర్యాదు అందిన మాట వాస్తవమేనని, విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

యునెస్కో సదస్సుకు రోహిణి

డిసెంబర్12 నుంచి 15వరకు హాంకాంగ్‌లో సదస్సు



కరీమాబాద్, నవంబరు21(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యునెస్కో సదస్సుకు వరంగల్ పెరుకవాడకు చెందిన రంగరాజు రోహిణి ఎంపికైంది. ఆమె ప్రస్తుతం హనుమకొండ సుబేదారి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతోంది. వెనుకబడిన వర్గానికి చెందిన రోహిణి అంతర్జాతీయ స్థాయిలో ఎంతో ప్రతిష్ఠాత్మకమైన 4వ అంతర్జాతీయ యునెస్కో మోడల్ ఎథిక్స్ ఆఫ్ న్యూరో టెక్నాలజీ కాన్ఫరెన్స్‌లో పాల్గొనేందుకు ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సదస్సు డిసెంబర్ 12 నుంచి 15వరకు హాంకాంగ్‌లో జరగనుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతుల ఎంపికలో మన దేశం నుంచి రోహిణికి స్థానం లభించడం విశేషం. ఈ సందర్భంగా యునెస్కో తెలంగాణ స్టేట్ చాప్టర్ కో-ఆర్డినేటర్, జాతీయ యువజన అవార్డు గ్రహీత మండల పరశురాములు రోహిణికి అభినందనలు తెలిపారు. అయితే ఆమెకు హాంకాంగ్ వెళ్లడానికి అవసరమైన ప్రయాణ ఖర్చులు భరించడానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు.

అంతా డొల్ల..!

- అధ్వానంగా అమృత్‌భారత్ పనులు
- యేడాదిలోపే ప్లాట్‌ఫారాలపై పగుళ్లు..
- పనిచేయని లిఫ్ట్‌లు.. కుంగుతున్న ఫ్లోర్
- మూణ్నాళ్ల ముచ్చటగా ఆధునిక సౌకర్యాలు
- అధ్వానంగా వరంగల్ రైల్వే స్టేషన్



నాలుగో ప్లాట్‌ఫామ్‌పై నూతన లిఫ్ట్ ముందు పగుళ్లు ఏర్పడిన దృశ్యం

గిర్మాజీపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక సౌకర్యాలు.. అత్యాధునిక హంగులు.. ఎయిర్‌పోర్ట్‌ను తలపించేలా నిర్మాణం.. అమృత్ భారత్ పథకం కింద కోట్ల రుపాయలతో వరంగల్ రైల్వే స్టేషన్‌ను తీర్చిదిద్దారు. అద్భుతం అనిపించారు. ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా అట్టహాసంగా ప్రారంభించారు. ఇంతవరకు బాగేదే ఉంది.కాని.. ప్రారంభించిన మూణ్నాళ్లకే పనుల్లో డొల్లతనం బయటపడింది. ప్లాట్‌ఫారాలపై పగుళ్లు ఏర్పడ్డాయి. లిఫ్టులు సరిగా పనిచేయడం లేదు.

తొలుత రూ.28 కోట్లతో..

వరంగల్ చారిత్రక, పర్యాటక ప్రాంత ప్రాముఖ్యతను గుర్తించిన రైల్వేశాఖ తొలుత పర్యాటక ప్రాంతాల రైల్వేస్టేషన్‌ల అభివృద్ధి పథకం కింద రూ.18 కోట్లు కేటాయించింది. వీటితో ప్లాట్‌ఫారాలు, విశ్రాంతిమందిరాలు, వరంగల్, శివనగర్ వైపు స్టేషన్ భవనాలను అభివృద్ధి చేశారు. కాకతీయ చారిత్రక కళావైభవం ఉట్టిపడేలా వరంగల్ వైపు భవనాన్ని సుందరీకరించారు. స్టేషన్‌లోని నాలుగు ప్లాట్‌ఫారాలపై పాత ఫ్లోరింగ్‌ను పూర్తిగా తొలగించి కొత్తగా వేశారు. అలాగే విశ్రాంతి మందిరాలలోని ఫ్లోర్, ఫర్నిచర్, ఫ్యానులు కొత్తవి ఏర్పాటు చేశారు.

తర్వాత రూ.25 కోట్లు..

అనంతరం అమృత్ భారత్ పథకం కింద మరో రూ.25 కోట్లతో వరంగల్ రైల్వేస్టేషన్‌ను ఎయిర్ పోర్ట్ తరహాలో సకల సదుపాయాలతో అభివృద్ధి చేశారు. సుమారు రెండు సంవత్సరాల పాటు పనులు చేశారు. ఎస్కలేటర్లు, లిఫ్ట్‌లు, భారీ ర్యాంపులు, భారీ వెడల్పుతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి, అధునాతనంగా ఉచిత, ప్రిపెయిడ్ ఏసీ విశ్రాంతి మందిరాలు, నాలుగు ప్లాట్‌ఫారాల ఫ్లోరింగ్, రైల్వేస్టేషన్ యావత్తు విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేశారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా, కేంద్ర, రాష్ట్ర మంత్రులు ప్రత్యక్షంగా ప్రారంభించారు. తీరా 9 నెలలు గడవక ముందే ప్లాట్‌ఫారాలపై పగుళ్లు వచ్చాయి. నాలుగో ప్లాట్‌ఫాంపై ఏర్పాటు చేసిన భారీ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి కింద ఏర్పాటుచేసిన నూతన లిఫ్ట్ చుట్టురా పగుళ్లు ఏర్పడ్డాయి. గ్రానైట్ రాళ్లు విరిగి కుంగిపోయి గుంతలు పడ్డాయి. దీంతో ప్రయాణికులు ముఖ్యంగా వృద్ధులు ఇబ్బందిపడుతున్నారు. మొదటి ప్లాట్‌ఫాంపై కూడా ఇదే పరిస్థితి ఉంది. జీఆర్‌పీ స్టేషన్ ముందు ప్లాట్‌ఫాంపై పెద్ద గుంత పడడంతో అంతా కుంగినట్లు కనిపిస్తున్నది. మరోవైపు లిఫ్ట్ పనిచేయకపోవడంతో ఎస్కలేటర్లు అంటే భయపడే వృద్ధులు మెట్లు ఎక్కలేక నరకం చూస్తున్నారు. అయినప్పటికీ స్థానిక రైల్వే ఇంజనీరింగ్ అధికారులు ఏమాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా రైల్వే ఉన్నతాధికారులు వరంగల్ రైల్వేస్టేషన్‌ను సందర్శించి విచారణ చేపట్టాలని, వెంటనే తగు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సహకార స్ఫూర్తికి రాజకీయ చీడ

- ప్రాభవం కోల్పోతున్న ఖానాపురం సొసైటీ
- ఒకప్పుడు ఉమ్మడి జిల్లాలోనే ఉత్తమ సంఘంగా గుర్తింపు
- కోర్టు పలుమార్లు మొట్టికాయలు వేసినా మారని తీరు
- మూడోసారి కొలువుదీరిన సొసైటీ పాలకవర్గం



బాధ్యతలు చేపడుతున్న సొసైటీ పాలకవర్గం

ఖానాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాజకీయ ఆధిపత్య క్రీడలో ఖానాపురం సొసైటీ ప్రతిష్ట మసకబారుతున్నది. వరుస కోర్టు వివాదాలతో రైతులకు సక్రమంగా సేవలు అందించలేక పోతోంది. ఒకప్పుడు ఉమ్మడి జిల్లాలోనే ఉత్తమ సహకార సంఘంగా నిలిచి పలు అవార్డులను సొంతం చేసుకున్న ఈ సొసైటీ రాజకీయ జోక్యంతో అస్తవ్యస్తంగా మారుతోంది. 2019లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా సహకార సంఘాలకు ఎన్నికలు జరిగాయి. వీటి పాలకవర్గాల పదవి కాలం 2025 ఫిబ్రవరి 14తో ముగిసింది. దీంతో వెంటనే మళ్లీ ఎన్నికలు నిర్వహించలేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా సొసైటీ పాలకవర్గాల పదవీ కాలాన్ని పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కానీ, ఖానాపురం సొసైటీ పాలకవర్గం పదవీ కాలాన్ని మాత్రం ప్రభుత్వం పొడిగించలేదు.

పీఏసీగా సహకార శాఖకు చెందిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ రాజా రవికిరణ్‌కు బాధ్యతలు అప్పగించింది. దీంతో సొసైటీ పాలకవర్గ సభ్యులు కోర్టుకు వెళ్లారు. కోర్టు పాత పాలకవర్గాన్నే కొనసాగించాలని తీర్పునివ్వడంతో 2025 మార్చి 1న తిరిగి పాలకవర్గం రెండోసారి కొలువుదీరింది. మళ్లీ ప్రభుత్వం 2025 మే 26న పాలకవర్గాన్ని రద్దుచేస్తూ పీఏసీగా సహకార శాఖకే చెందిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఈగ వెంకటేశ్వర్లుకు బాధ్యతలు అప్పగించింది. దీంతో మరోమారు సొసైటీ పాలకవర్గం హైకోర్టుకు వెళ్లారు. ఈ నెల 19న హైకోర్టు పాత పాలకవర్గాన్నే కొనసాగించాలని తీర్పునిచ్చింది. దీంతో శుక్రవారం ముచ్చటగా మూడోసారి చైర్మన్ రామస్వామినాయక్‌తో పాటు 13 మంది డైరెక్టర్లతో కూడిన పాలకవర్గం కొలువుదీరింది.

సేవలలో జాప్యం..

సొసైటీ పాలకవర్గం రద్దవుతూ కొనసాగుతున్న తరుణంలో సొసైటీ పరిధిలోని రైతులకు సేవలు అందించడంలో జాప్యం జరుగుతున్నది. పాలకవర్గం ఉన్న సమయంలో ప్రధానంగా సీజన్‌కు ముందే పెద్దఎత్తున ఎరువులను (బఫర్‌స్టాక్ కింద) కొనుగోలు చేసుకుని గోదాములలో నిల్వ ఉంచేవారు. దీంతో రైతులకు యూరియా ఇబ్బందులు తలెత్తేవికావు. ఈ వానాకాలం సీజన్‌లో పాలకవర్గం లేకపోవడంతో అధికారులు ముందస్తుగా ఎరువులను కొనుగోలు చేయకపోవ డం మూలంగా యూరియా దొరకక పాకాల ఆయకట్టు రైతులు చాలా అవస్థలు పడాల్సి వచ్చింది. గత ప్రభుత్వంలో సొసైటీ ఆధ్వర్యంలోనే ఎక్కువగా ధాన్యం కొనుగోళ్లు జరిగేవి. దీంతో సొసైటీకి ప్రతి సీజన్‌కు లక్షల రుపాయాల లాభం చేకూరేది. కానీ గత కొద్ది సంవత్సరాలుగా రాజకీయాలు పెరిగి రాజకీయ నాయకులు సూచించిన వారికి ధాన్యం కొనుగోలు కేంద్రాలు మంజూరవుతుండడంతో సొసైటీ కొనుగోళ్లు తగ్గుతున్నాయి. తద్వారా లాభాలు సైతం తగ్గుతున్నాయి.

పాలకవర్గంతో ఆటలాడుకోవద్దు...

నీతి నిజాయితీగా పనిచేసి సంఘాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లిన పాలకవర్గంతో ప్రభుత్వం ఆటలాడుకోవడం మంచిదికాదు. పాలకవర్గాన్ని అన్యాయంగా రద్దు చేసిన ప్రతి సందర్భంలో కోర్టులు ప్రభుత్వానికి మొట్టికాయలు వేస్తూనే ఉన్నాయి. ప్రతిపక్షం అనే కోణంలో చూసి ప్రభుత్వం పాలకవర్గాన్ని ఇబ్బందులకు గురిచేయడం మంచి సంస్కృతి కాదు. గతంలో పాలకవర్గాల గడువు ముగిసినపుడు ప్రభుత్వాలు ఇలా కక్షపూరితంగా వ్యవహరించలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం పాలకవర్గానికి సహకరించాలి.

గుగులోత్ రామస్వామినాయక్, సొసైటీ చైర్మన్

అంచనాల పెంపులో అక్రమాల కంపు

(5వ పేజీ తరువాయి)

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి శంకుస్థాపన చేసింది. 56ఎకరాల్లో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రితో పాటు ఎంజీఎం ఆస్పత్రి, కాకతీయ మెడికల్ కాలేజీ, కాళోజీ హెల్త్ యూనివర్సిటీ అన్ని కూడా ఒకే కాంప్లెక్స్ పరిధిలోకి తెచ్చేలా వరంగల్ హెల్త్ సిటీ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి 2021లో రూ.1,116 కోట్లు కేటాయిస్తూ అప్పటి వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ జీవో నెంబరు 158 విడుదల చేశారు. ఎల్‌అండ్‌టీ కంపెనీ ఆస్పత్రి పనులను చేపట్టింది. అయితే ఏడాదికాకముందే ఎలాంటి అనుమతులు లేకుండా రూ.1,725.95 కోట్లకు గత ప్రభుత్వం పెంచింది. అదనంగా రూ.625.95 కోట్ల వ్యయాన్ని పెంచడాన్ని గోప్యంగా ఉంచింది. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి ఎలాంటి అదనపు అంచనాలు లేకుండా రూ.1,725.95 కోట్లకు పెంచడంపై కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ చేపట్టింది. గత ఏడాది జూన్ 29వ తేదీన స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని పరిశీలించి, అంచనాల పెంపుపై అనుమానాలు రావటంతో ఫోరెనిక్స్ ఆడిట్ రిపోర్టుకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో అన్ని కోణాల్లో ఫోరెనిక్స్ ఆడిట్ బృందం పరిశీలిన చేసిన అనంతరం సుమారు రూ.600 కోట్ల అంచనా వ్యయాన్ని ఎలాంటి అనుమతులు లేకుండా పెంచినట్లుగా నిర్ధారించినట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన ప్రతీ అంశాన్ని ప్రస్తావిస్తూ ప్రభుత్వానికి ఫోరెనిక్స్ ఆడిట్ బృందం నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది.

మరోవైపు తెలంగాణ స్టేట్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీఎస్ఎస్‌హెచ్‌సీఎల్)ను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కార్పొరేషన్‌కు వరంగల్ సెంట్రల్ జైలు భూమి సర్వే నెంబరు 31,32లోని 2,75,759గజాల స్థలాన్ని (56ఎకరాలు)బదిలీ చేస్తూ జీవో నెం.81ని జారీ చేసింది. టీఎస్ఎస్‌హెచ్‌సీఎల్ జైలు స్థలాన్ని తాకట్టు పెట్టి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి కోసం బ్యాంక్ ఆఫ్ మహరాష్ట్ర, హైదరాబాద్ నుంచి రూ.1,173 కోట్ల రుణం తీసుకుంది. అయితే ఈ మొత్తాన్ని ఆస్పత్రి నిర్మాణానికి ఖర్చు చేయకుండా, ఇతర వాటికి మళ్లించారు.

జైలు భూమిని తాకట్టు పెట్టడం ఏమిటని.. తీసుకున్న రుణాన్ని ఆస్పత్రికి కాకుండా ఇతర వాటికి మళ్లించటం ఏమిటని గత ప్రభుత్వ విధానాన్ని సీఎం రేవంత్‌రెడ్డి తప్పు పట్టారు. దీనిపై గత ఏడాది ఆగస్టు 30వ తేదీన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ శాఖతో విచారణకు ఆదేశించారు. దీంతో విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. ఆస్పత్రి నిర్మాణంలో భాగస్వామ్యం ఉన్న ఇంజనీర్లు, కాంట్రాక్టు కంపెనీతోపాటు పలువురు ప్రభుత్వ వైద్యులను కూడా విజిలెన్స్ అధికారులు విచారించారు. ఫోరెనిక్స్ ఆడిట్ రిపోర్టు పూర్తయినప్పటికీ విజిలెన్స్ నివేదిక అందిన తరువాతే అంచనాల పెంపునకు సహకరించిన పలువురు వైద్యులు, ప్రొఫెసర్లు, ఇంజనీరింగ్ విభాగం అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

మార్చిలోగా సేవలు అందేనా..?

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని మార్చి నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. గత ప్రభుత్వం పెంచిన అంచనా వ్యయం రూ.1,725.95 కోట్లపై ఆడిట్ చేసింది. అధికారులతో పలు మార్లు సమీక్షల అనంతరం రూ.1,558 కోట్లకు అంచనా వ్యయాన్ని కుదించింది. వీటిలో సివిల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్, వాటర్, పారిశుధ్య పనుల కోసం రూ.1159.77 కోట్లు కేటాయించారు. అలాగే వైద్య పరికరాలు, అనుబంధ పనుల కోసం రూ.10.71 కోట్లు, నిర్మాణాలు, పర్యావరణం, డిజైన్, ఎన్‌వోసీలు తదితర చట్టబద్ధమైన అనుమతుల కోసం రూ.4.47 కోట్లు కేటాయించారు. అలాగే అస్పతి భవన నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న ఆర్‌అండ్‌బీ శాఖకు రూ. 1.83 కోట్లు, జీఎస్టీలతోపాటు ఇతర పన్నుల కోసం రూ.22.80 కోట్లు కేటాయించారు. రూ.1,558 కోట్లతో ఆస్పత్రిని నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2022-23లో కంటే ప్రస్తుతం నిర్మాణ వ్యయం భారీగా పెరిగినప్పటికీ అంచనా వ్యయాన్ని రూ.167.95 కోట్లకు కాంగ్రెస్ ప్రభుత్వం తగ్గించింది. ఇప్పటివరకు 85 శాతం పైగా పనులు పూర్తయ్యాయని, ఆస్పత్రిలో ఎక్విప్‌మెంట్ ఇన్‌స్టాల్ కూడా చేపడుతున్నారు. నిధుల కొరత కూడా లేకపోవటంతో మార్చిలోపు పనులు పూర్తిచేసి సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా సూపర్ సేవలను ప్రజలకు అందించాలనే లక్ష్యంతో ఉన్నారు.

అక్రమాలపై రాజకీయం

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం, అంచనాల పెంపుపై రాజకీయ విమర్శలు పేలుతున్నాయి. గత ప్రభుత్వం పేదల ఆస్పత్రి పేరుతో సుమారు రూ.600 కోట్ల అక్రమాలకు పాల్పడ్డారని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆరోపిస్తే.. తామే 85శాతం పనులు పూర్తి చేశామని, మిగతా పనులు కూడా పూర్తి చేసే సత్తా కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని ఇటీవల ఆస్పత్రిని పరిశీలించిన మాజీ మంత్రి హరీష్‌రావు విమర్శించారు.

అయితే ఆస్పత్రి అంచనాలను పెంచి హరీష్‌రావుకు సంబంధించిన బినామీ కంపెనీకి కేటాయించారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేసిన ఆరోపణలు రాజకీయాల్లో కలకలం రేపుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఫోరెనిక్స్ ఆడిట్ రిపోర్టుతో పాటు విజిలెన్స్ నివేదికను విడుదల చేస్తే.. పేదల ఆస్పత్రికి కేటాయించిన సొమ్ముతో పాటు జైలును తాకట్టు పెట్టి తెచ్చిన నిధులు ఎవరి ఖాతాలోకి వెళ్లాయనేది వెలుగులోకి వచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.


కేసముద్రం మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన ధాన్యం

మార్కెట్‌కు 6వేల బస్తాల ధాన్యం రాక

● ఆర్ఎన్ఆర్ క్వింటాకు గరిష్ఠ ధర రూ.2,691

కేసముద్రం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం 6598 బస్తాల ధాన్యాన్ని రైతులు విక్రయించేందుకు తీసుకువచ్చారు. క్రితం రోజు బుధవారం మార్కెట్‌కు 2554 బస్తాల ధాన్యం రాగా తాజాగా మూడురెట్లు ఎక్కువగా 6598 బస్తాల రాబడులు పెరిగాయి. ఇందులో జైశ్రీరాం రకం ధాన్యం 28 మంది రైతులు 1116 బస్తాలు, ఆర్ఎన్ఆర్ రకం 123 మంది 4478 బస్తాలు, హెచ్ఎంటీ రకం 28 మంది 1004 బస్తాలు విక్రయించేందుకు తీసుకువచ్చారు. ఈ-నామ్ విధానంలోని ఈ-వేలంలో జైశ్రీరాం రకం క్వింటాకు గరిష్ఠంగా రూ.2849, కనిష్ఠంగా రూ.2483, సగటున రూ.2809, ఆర్ఎన్ఆర్ రకం గరిష్ఠంగా రూ.2691, కనిష్ఠంగా రూ.2401, సగటున రూ.2589, హెచ్ఎంటీ రకం ధాన్యం క్వింటాకు గరిష్ఠంగా రూ.2618, కనిష్ఠంగా రూ.2501, సగటున రూ.2559 ధరల చొప్పున వ్యాపారులు ఖరీదులు చేశారు. బుధవారం నాటి మార్కెట్‌లో ఆర్ఎన్ఆర్ సగటు ధర రూ.2580 ఉండగా రూ.2589లకు చేరింది. గరిష్ఠ ధర మాత్రం రూ.2599 ఉండగా దాదాపు రూ.100లు పెరిగి తాజాగా రూ.2691 నమోదు కావడం విశేషం.

విద్యతో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్యం

● మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యతో పాటు క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యత నిస్తూ.. అధిక నిధులు కేటాయిస్తుందని మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ ఫాతిమా హైస్కూల్‌లో 19వ సీఎస్ఏ రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలను శుక్రవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. క్రీడలకు పుట్టినిల్లు మానుకోట అని, ఈ ప్రాంతం నుంచి ఎంతోమంది వివిధ క్రీడల్లో రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించారని చెప్పారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని వాటితో సంబంధం లేకుండా క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని చాటాలన్నారు. ఆటగాళ్లు జాతీయ, రాష్ట్ర క్రీడల్లో సత్తాచాటాలన్నారు. ప్రిన్సిపాల్ ఆరోగ్యమేరీ, డీఈవో దక్షిణామూర్తి, డీఎస్పీ తిరుపతిరావు, కాంగ్రెస్ నాయకులు శంతన్‌రామరాజు, ఎడ్ల రమేష్, సల్వాది దిలీప్ పాల్గొన్నారు.


మచ్చర్లలో కల్యాణలక్ష్మి చెక్కులను అందచేస్తున్న మురళీనాయక్

మత్స్యకారుల అభివృద్ధికి కృషి..

మత్స్యకారుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ శివారు కంబాల చెరువులో రాష్ట్ర ప్రభుత్వం మత్స్యశాఖ ద్వారా వంద శాతం సబ్సిడీతో ఉచితంగా పంపిణీ చేసే చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చెరువు శిఖాల్లో ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దని, ఎవరైనా నిబంధనలు అతిక్రమించి నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. మత్స్యశాఖ జిల్లా అధికారి శివప్రసాద్, మత్స్యపారిశ్రామిక సహకార సంఘం చీఫ్ ప్రమోటర్ కొత్తూరు రమేష్, దామెర శ్రీనివాస్, అశోక్, దశరథం, వీరయ్య, నాగరాజు, ఐలయ్య, వెంకన్న పాల్గొన్నారు.

పేదలకు సంక్షేమ పథకాలు

● గూడూరు : కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే పేదలకు సంక్షేమ పథకాలు అందుతాయని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. మచ్చర్లలో కార్యకర్తల సమావేశం, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ, వెంగంపేటలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మట్టెవాడలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణా ప్రాంతాల్లో పేదలకు సంక్షేమ ఫలాలు అందించేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఇటీవల మృతుల కుటుంబాలను పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో డీటీ కోమల, కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు రమేష్‌చందర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, కొమ్మాలు, చిట్టి వెంకటేశ్వర్లు, శ్రీపాల్‌రెడ్డి, మధు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను 'బీసీ-ఏ'లోకి మార్చాలి

● ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి దుర్గేష్

కేసముద్రం, నవంబరు21 (ఆంధ్రజ్యోతి) : సామాజికంగా, రాజకీయంగా వెనుకబడిన ముదిరాజ్ కులస్థులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి నీలం దుర్గేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఉప్పరపల్లిలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా ఆ మహాసభ జెండాను ఆయన ఆవిష్కరించారు. జెనిగల అనీల్ కుమార్, కొత్తూరు రమేష్, ఎలబోయిన సారయ్య, బోనగిరి ఉప్పలయ్య, అంకిరెడ్డి యాకయ్య, అరిగె విజేందర్ పాల్గొన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్ విజేతలకు ప్రశంసాపత్రాల అందచేత


జడ్పీ హైస్కూల్లో ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ఎస్ఐ కరుణాకర్

ఇనుగుర్తి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తి జడ్పీ హైస్కూల్లో శుక్రవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన మండలస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులకు ఎస్ఐ జి.కరుణాకర్ ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో విద్యాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు దార్ల రాంమూర్తి, కోకన్వీనర్ గంజి రాజేందర్‌రెడ్డి, జేవీవీ మండలఅధ్యక్షుడు దార్ల భాస్కర్, పొన్నం కవిత, చిన్నాల కట్టయ్య, ప్రిన్సిపాల్ జయశ్రీ, పింగిళి శ్రీనివాస్, పాల్గొన్నారు.

● కేసముద్రం : కేసముద్రం స్టేషన్ జడ్పీ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ఎస్ఐలు క్రాంతికిరణ్, నరేష్, ఎంఈవో యాదగిరి, హెచ్ఎం రాజు ప్రశ్నాపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. జేవీవీ మండల అధ్యక్ష, కార్యదర్శులు చిర్ర యాకాంతంగౌడ్, బండారు నరేందర్, గనె యాదగిరి, సురేష్, నర్సింహారాజు, మోహనకృష్ణ పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పనులు ప్రారంభం

ఇనుగుర్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తిలోని గొల్లబజారులో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మంజూరు చేసిన రూ.10లక్షల నిధులతో రెండు సీసీ రోడ్ల నిర్మాణ పనులను శుక్రవారం గ్రామ ప్రముఖుడు, ఆయన సోదరుడు వద్దిరాజు దేవేందర్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దార్ల రాంమూర్తి, బేతమల్ల చంద్రయ్య, గండు నాగన్న, జగన్, గాజుల రాజాలు, బూర రజినీకాంత్ పాల్గొన్నారు.

'ఉపాధి చట్టాన్ని అమలు చేయాలి'

కేసముద్రం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉపాధి హామీ పథకంలో కొలతలతో సంబంధం లేకుండా 200 రోజుల పని కల్పించి, నిత్యం రూ.800 చొప్పున కూలీని చెల్లించే విధంగా చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య డిమాండ్ చేశారు. మండలంలోని తాళ్లపూసపల్లిలో ఆ సంఘం 8వ మండల మహాసభను కావటి నర్సయ్య, మండల రామక్క అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి.యాకూబ్, గొడిశాల వెంకన్న, జల్లె జయరాజు, జలేందర్, ఎల్లయ్య, శ్రీనివాస్, శేఖర్, నాగమ్మ పాల్గొన్నారు.

పౌరసరఫరాల శాఖ అధికారిని కలిసిన రేషన్ డీలర్లు


రమేష్‌నాయక్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సంఘం నేతలు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి జాటోతు రమేష్‌నాయక్‌ను శుక్రవారం రేషన్ డీలర్ల సంఘం బాధ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. మహబూబాబాద్‌లో ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రమేష్‌ను రేషన్ డీలర్లు కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. జిల్లా మేనేజర్ కృష్ణవేణి, రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కుంభం యాదగిరిగౌడ్, ముంజాల యాకయ్య, గొర్రె వెంకన్న, డివిజన్ అధ్యక్షుడు గుగులోతు వేణుగోపాల్, జిన్నారపు రాంచందర్‌రావు, రుద్రారపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

రణభేరిని జయప్రదం చేయాలి

కేజీకేఎస్ మండల అధ్యక్షుడు వీరస్వామి

గూడూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట పట్టణంలో ఈ నెల 28న జరిగే గీతన్నల రణభేరిని జయప్రదం చేయాలని కల్లుగీత కార్మిక సంఘం (కేజీకేఎస్) మండల అధ్యక్షుడు పానుగంటి వీరస్వామి అన్నారు. గూడూరులో ఈ మేరకు శుక్రవారం గీతన్నల రణభేరి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్లుగీత వృత్తి చేసే వారందరికి కాటమయ్య రక్షణ కవచం అందించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలు 4 వేల పింఛన్, 10 లక్షల ఎక్స్‌గ్రేషియా అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఎడ్యుకేషన్ డబ్బులను వెంటనే విడుదల చేయాలన్నారు. 50 సంవత్సరాలు నిండిన గీత కార్మికులందరికి పింఛన్ అందించాలన్నారు. భర్త చనిపోతే వెంటనే భార్యకు పింఛన్‌ను వెంటనే అందించాలన్నారు. ఏజెన్సీల్లో సొసైటీలను పునరుద్ధరించి వారికి సంక్షేమ ఫలాలు అందించాలన్నారు. ఈ గీత కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆటో ప్రయాణికుల భద్రత కోసం 'అభయ యాప్'

● ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

మహబూబాబాద్ క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆటో ప్రయాణికుల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం 'అభయ మైటాక్సీ సేఫ్ యాప్'ను వినియోగంలోకి తీసుకువవచ్చిందని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏబీ ఫంక్షన్ హాల్‌లో పట్టణ సీఐ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు, ప్రయాణికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆటో నడిపే వ్యక్తులను ఒక సంస్థతో అనుసంధానం చేసి ప్రతీ ఏటా రూ.350 రూపాలయల ప్రీమియంతో బీమా చేస్తే ప్రమాద బీమాతో పాటు అన్ని రకాల రక్షణతో పాటు, లబ్ధి చేకూరుతుందన్నారు. ఆటో డ్రైవర్లు బీమా చేసుకోవాలన్నారు. అభయ యాప్‌లో మహిళా ప్రయాణికులు ఆటో ఎక్కే సమయంలో క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి డైరెక్ట్ వివరాలు తెలుసుకోవచ్చన్నారు. మై టాక్సీ సేఫ్ యాప్‌ను ప్రతీ మహిళా ప్రయాణికురాలుతో పాటు, ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. అభయ యాప్‌తో పూర్తి వివరాలు పోలీస్ శాఖలో పొందు పరిచి ఉంటాయన్నారు. ఈ యాప్‌ను ప్రయాణికులు క్షేత్రస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు తిరుపతి రావు, మోహన్, సీఐలు మహేందర్‌రెడ్డి, సర్వయ్య, ఉపేందర్, సత్యనారాయణ, చంద్రమౌళి, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుధీర్ రాంనాథ్ కేకన్

హామీల అమలులో విఫలం

● మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు చిన్నచంద్రన్న


మాట్లాడుతున్న చిన్నచంద్రన్న

మహబూబాబాద్ రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పాయం చిన్నచంద్రన్న విమర్శించారు. మహబూబాబాద్‌లో మాస్‌లైన్ కార్యాలయంలో శుక్రవారం ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నచంద్రన్న మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రెండు సంవత్సరాల పూర్తితో సంబురాల పేరుతో ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. గత సంవత్సరం రైతులకు బోనస్ ఇవ్వకుండానే కాలయాపన చేశారని పేర్కొన్నారు. ఈనెల 24న జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టే ధర్నాకు పార్టీ నాయకులు, రైతులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొత్తపల్లి రవి, ప్రభాకర్, ముంజంపల్లి వీరన్న, బిల్లకంటి సూర్యం, ఉమ్మగాని సత్యం పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవండి

● ఐఆర్‌సీఎస్ జిల్లా చైర్మన్ ప్రసాద్

మహబూబాబాద్ టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) :ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) జిల్లా చైర్మన్ ప్రసాద్ అన్నారు. శ్రీసత్య సాయి బాబా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా మహబూబాబాద్ సాయిబాబా దేవాలయంలో శుక్రవారం ఐఆర్‌సీఎస్ సహకారంతోసత్యసాయిసేవా ట్రస్టు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని చేపట్టి 56 యూనిట్లు సేకరించారు. ఈ సందర్భంగా పీవీ. ప్రసాద్ మాట్లాడుతూ ఆస్పత్రుల్లో అనేక సందర్భాల్లో రక్తం అవసరం ఉన్న సమయంలో లభించక ఇబ్బందులు తలెత్తుతున్నాయని చెప్పారు. గ్రామాల్లో స్వచ్ఛంద సంస్థలు రక్తదానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రక్తదానం చేయడానికి ముఖ్యంగా యువత ముందుకు రావాలని కోరారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఐఆర్‌సీఎస్ బాధ్యులు డాక్టర్ బానోత్ నెహ్రూరాథోడ్, మాధవపెద్ది వెంకటరెడ్డి, పర్కాల రవీందర్‌రెడ్డి, సత్యసాయి సేవా సమితి బాధ్యులు సైదయ్య, ప్రదీప్, పణి, ఓం ప్రకాశ్ పాల్గొన్నారు.


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రసాద్


ఎమ్మెల్యే కనకయ్యకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యమకారులు

'సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి'

బయ్యారం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆ ఫోరం మండల కమిటీ సభ్యులు వీరభద్రం, రామనాథం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మలిదశ ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలు కోసం శుక్రవారం ఉద్యమకారులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఉద్యమకారులు మాట్లాడుతూ ఉద్యమకారులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు మంజూరు చేయాలన్నారు. ఉద్యమకారులు శ్రీనివాస్, క్రిష్ణ, రాంబాబు, శ్రీను, దస్తగిరి, లింగయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

కార్మికులకు బిల్లులను చెల్లించాలి

బయ్యారం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజన కార్మికులు (ఎండీఎం) బిల్లులను వెంటనే చెల్లించాలని సీఐటీయూ మండల కన్వీనర్ వల్లాల వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎండీఎం కార్మికుల సమస్యల పరిష్కారానికి శుక్రవారం ఎంఈవో దేవేంద్రాచారికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎండీఎం కార్మికుల సమస్యల కోసం ఈనెల 24న జరిగే ధర్నాలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఆదిశేషులు, చంద్రమౌళి, యశోద, ఉపేంద్ర, లక్ష్మీ, విజయ పాల్గొన్నారు.

పేదల గొంతుకగా నిలిచిన సీపీఐ

● రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు

డోర్నకల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : దేశంలో పేద ప్రజలు, అణగారిన వర్గాలు, కార్మికుల గొంతుకగా సీపీఐ నిలిచిందని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. సీపీఐ శతాబ్ది మహాసభల బస్సుజాత శుక్రవారం డోర్నకల్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా గాంధీసెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు విజయసారథి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నెల్లూరి నాగేశ్వర్‌రావు, మండల కార్యదర్శి తురక రమేష్, ప్రభేష్, సత్యనారాయణ, జన్నె స్వామి పాల్గొన్నారు.

రైతుల కోసమే వడ్ల కొనుగోలు కేంద్రాలు

కురవి, నవంబరు21 (ఆంధ్రజ్యోతి) : రైతుల సౌలభ్యం కోసమే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ సుధాకర్‌నాయక్ అన్నారు. సీరోలు మండల కేంద్రంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. తహసీల్దార్ పున్నం చందర్, ఎస్సై గండ్ర సంతోష్, ఎంపీడీవో గౌస్, కాంగ్రెస్ నాయకులు కాలం రవీందర్‌రెడ్డి, జీపీవో వీరస్వామి, కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, ప్రతాపని బిక్షమయ్య, వీరిశెట్టి ఉపేందర్ పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న మార్కెట్ చైర్మన్ సుధాకర్‌నాయక్

సైన్స్‌పట్ల అవగాహన పెంచుకోవాలి

డోర్నకల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నిత్యజీవితంలో సైన్స్ ప్రతీ అంశంలో ముడిపడి ఉందని విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని జనవిజ్ఞాన వేదిక డోర్నకల్ మండల కన్వీనర్ రాజేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం డోర్నకల్ జిల్లా పరిషత్ హైస్కూల్లో చెకుముఖి టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ చెకుముఖి టాలెంట్‌టెస్ట్‌కు అన్ని ప్రభుతత్వ పాఠశాలలతో పాటు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చెకుముఖి టాలెంట్‌టెస్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసినట్లు రాజేశ్వర్‌రావు తెలిపారు. శాస్త్రసాంకేతిక రంగాల్లో వస్తున్న ఆదునీక మార్పులను విద్యార్థులు అవగతం చేసుకోవాలన్నారు. ఎంఈవో లక్మా, జడ్పీహైస్కూల్ హెచ్ఎం బండి నర్సింహారావు, ఉపాధ్యాయులు సాహెబ్‌ఆలీ, శ్రీనివాస్, విద్యాసాగర్, కమల, చావ కృష్ణభాను, పసాల ఆంటోని పాల్గొన్నారు.

'మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు'


మాట్లాడుతున్న ప్రజారోగ్యశాఖ డీఈఈ నవీన్

డోర్నకల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ పరిధిలో మౌళిక సదుపాయాల కల్పన కోసం టీయూ ఎఫ్ఐడీసీ నిధులు రూ.10 కోట్లు మంజూరైనట్లు ప్రజారోగ్యశాఖ డీఈఈ నవీన్ శుక్రవారం అన్నారు. ఈ నిధుల కింద పట్టణంలో 1.5 కిలోమీటర్లు బీటీ రోడ్డుతో పాటు 1.5 కిలో మీటర్ల డ్రైనేజీ కాల్వల నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. అలాగే ప్రధాన జంక్షన్‌లలో సీసీ రోడ్ల ఏర్పాటుతో అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు సుమీర్‌చంద్‌జైన్, మాద శ్రీనివాస్, శీలం శ్రీనివాస్, దాసరి నాని, ఎస్.వెంకటేశ్వర్లు, ప్రవీన్, రాము, హరికృష్ణ, ఖాదర్‌బాబా, మామిడి నాగరాజు, పబ్లిక్ హెల్త్ ఏఈ శృతిలు ఉన్నారు.

బాస్కెట్ బాల్ పోటీలకు రాజోలు విద్యార్థి

కురవి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజోలు జడ్పీఎస్ఎస్‌కు చెందిన శైలజ అండర్-17 ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైందని హెచ్ఎం రఘువేందర్, పీడీ కాశీనాథ్ తెలిపారు. ఉమ్మడి జిల్లా సెలక్షన్స్‌లో ప్రతిభ చూపిన తేజావత్ శైలజా ఈనెల 25, 26 తేదీల్లో కరీంనగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన శైలజను ఉపాధ్యాయులు దామోదర్‌రెడ్డి, బీకుచౌహాన్, వి.సురేష్, రాజేశ్వరి, రవికుమార్, కిషన్, వసంత, భవాని, సతీష్, కిరణ్, నరేష్, ప్రభాకర్, శ్రీధర్‌లు అభినందించారు.

ముగ్గురు సీఐలు, 8 మంది ఎస్సైల బదిలీ

వరంగల్ క్రైం, నవంబర్ 21(ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషరేట్ పరిధిలో పలువురు సీఐలు, ఎస్సైలను బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మామునూరు ఇన్‌స్పెక్టర్‌గా ఐటీకోర్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న ఈ.శ్రీనివాస్‌ను నియమించగా, ఇంతకాలం అక్కడ విధులు నిర్వర్తించిన ఒంటేరు రమేష్‌ను వీఆర్‌కు బదిలీ చేశారు. అలాగే వీఆర్‌లో ఉన్న ప్రవీణ్ ఐటీకోర్‌కు బదిలీ అయ్యారు. అలాగే ఎస్సైల విభాగంలో ఎస్.రాజన్‌బాబు జనగామ నుంచి వీఆర్‌కు, రాజేష్‌కుమార్ జనగామ నుంచి ఐటీ కోర్‌కు, ఎన్.కృష్ణవేణి మామునూరు నుంచి సుబేదారికి, మహమ్మద్ నజీర్‌పాషా ఐటీ కోర్ నుంచి మామునూరుకు, బి.రవీందర్ కేయూసీ నుంచి వీఆర్‌కు, బి.విజయ్‌కుమార్ హనుమకొండ ట్రాఫిక్ నుంచి కేయూసీకి, ఈ.రతీష్ ఎస్పీ నుంచి జనగామకు, వి.దిలీప్ టాస్క్‌ఫోర్స్ నుంచి కమలాపూర్‌కు బదిలీ అయ్యారు.

తెల్లబోతున్నారు.!

(5వ పేజీ తరువాయి)

యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకొని, రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా రైతులకు తెలిక పోవడంతో సేవా కేంద్రాలు, ఏఈవోల చుట్టూ తిరుగుతున్నారు. రోజుల తరబడి ఫొటోలు, ఆధార్, పాసుబుక్ తదితర డాక్యుమెంట్లు వెంటతీసుకొని తిరిగినా, గంటల పాటు యాప్ కోసం సమయంవృథా చేసుకున్నా రిజిస్ట్రేషన్ కావడం లేదు. సాంకేతిక లోపమే కారణమని అధికారులు చెప్పి చేతులు దులుపుకోవడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. యాప్‌లో ఏ వివరాలు నమోదు చేయాలని, ఏలా నమోదు చేయాలని పూర్తిస్థాయిలో గ్రామాల్లో అవగాహన కల్పించాలని, ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

దళారులను ఆశ్రయిస్తున్న రైతులు

దళారి వ్యవస్థను కట్టడి చేయడానికి తీసుకువచ్చిన కపాస్ కిసాన్ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ పూర్తికాకపోవడంతో యాప్ ద్వారా నమోదుకాని రైతులు దళారులను ఆశ్రయించి పత్తి పంటను విక్రయించుకోవాల్సి వస్తుంది. అంతేకాకుండా యాప్ ద్వారా ఎకరాకు 7 క్వింటాళ్ల పత్తి మాత్రమే విక్రయించుకునే అవకాశం ఉండడంతో అధిక దిగుబడి ఉన్న రైతులు మిగతా పత్తి ఏ విధంగా విక్రయించుకోవాలని ప్రశ్నిస్తున్నారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన రైతులు మిల్లుల్లో నుంచి టోకెన్లు రాకపోవడంతో విక్రయాలు ఆలస్యమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి నిల్వలు ఎక్కువ అవుతుండడంతో ధరలు పడిపోతాయనే ఆందోళనతో దళారులను ఆశ్రయిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొర్రూరు డివిజన్ పరిధిలోని 8 మండలాల్లో 41 క్లస్టర్ల వ్యాప్తంగా సుమారు 36, 244 మంది రైతులు సుమారుగా 49,122 ఎకరాల వరకు పత్తిసాగు చేసినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు.

కేసముద్రం సొసైటీ పాలకమండలి తిరిగి కొనసాగింపు

కేసముద్రం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) పాలకమండలిని పునరుద్ధరిస్తూ రాష్ట్ర హైకోర్టు ఆదేశాలతో జిల్లా సహకార అధికారి ఉత్తర్వులు జారీ చేసినట్లు సొసైటీ చైర్మన్ దీకొండ వెంకన్న, వైస్‌చైర్మన్ అంబటి మహేందర్‌రెడ్డి తెలిపారు. ఆ సొసైటీ కార్యాలయంలో శుక్రవారం వారు విలేఖరులతో మాట్లాడారు. అధికారుల సూచనలతో మార్కెట్ మొక్కజొన్నల కొనుగోళ్లలో మూడు నెలలపాటు నిల్వ ఉంచడంతో తూకంలో తేడా వచ్చిందని, దీనికి పాలకమండలిని బాధ్యులను చేస్తూ రద్దు చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై తాము హైకోర్టును ఆశ్రయించగా పాలకమండలిని కొనసాగించాలని ఆదేశాలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు బీరం గోపాల్‌రెడ్డి, నూనావత్ శ్రీనివాస్, కొట్టం మహేందర్, సపావట్ నంద, మర్రి యాకన్న, కాలేరు లక్ష్మయ్య, బొడ్డు లక్ష్మీభిక్షం, తోట శోభనాగన్న పాల్గొన్నారు.